# దయ్యాల మేడ

ఉర్దూ : మఖ్దూం మొహియుద్దీన్

తెలుగు : గజ్జల మల్లారెడ్డి



అది ఒక దయ్యాల మేడ
శిథిల సమాధాల నీడ
పీనుగులను పీక్కుతినే
రాబందుల రాచవాడ
అస్వాంతం అంతులేని
అరిష్టాల మహాపీఠ
ఎటుచూస్తే అటు చీకటి
ఎటుకన్నా శిథిలాలే!
అంతా ఒక నిస్తబ్ధత
అలుముకున్న పల్లెరాడు!
పర్రెల్లో నెర్రెల్లో
పాములు తేళ్ళూ కొల్లలు
అబ్బో! ఎంత భయంకర
మెంతటి బీభత్స ప్రకృతి!!
కాశీ భూసుర నివహం
కాబా ఫకీర బలగం
మార్వాడీ షావుకులు
మహా మహా శ్రీమంతులు
అంతా యీ కంటకా
ఐక్యంగా వసిస్తారు
ఇది దొంగల పడకటిల్లు
హంతకులకు పుట్టినిల్లు
ఇట నీతికి అనునిత్యం
విధిస్తారు మరణశిక్ష
అహర్నిశలు మానవతను
అమ్ముతారు వేలంలో
జీవితాని కిట మరణ వి
శిష్టత నేర్పించుతారు
నిట్టూర్పులు ఝుంఝూవిక
టాట్టహాసముల మించును
లక్ష్మీదేవి చిరుగజ్జెల
లాస్యమజస్రమ్ము సాగు
దారిదప్పియైనా యీ
దాకిన రాబోదు బ్రతుకు
గతం వర్తమానంపై
కటుహాస్యం చేస్తున్నది
పడుపుతనం శీలంతో
పరియాచక మాడుతుంది
ఇంకోవైపున తిండికి
వుండేందుకు నీడలేని
అణగారిన శ్రమజీవుల
అన్నార్తుల సందోహం
కళ్ళల్లో అసంతృప్తి
కణకణమని మండుతోంది
ఓ సమస్త లోకేశా!
ఓ సర్వాంతర్యామీ! నీ
చేతులార సృష్టించిన
శిల్పము దుర్దశను చూడు!
మితికి నేస్తాలెవరో
స్పష్టంగా తెలుసు నాకు
శోకసభను నిర్వహించు
సూత్రధారులను చూచితి
మత పీతాంబరము కుష్టు
మచ్చల దాచెయ్యలేదు
ఆకలి మంటల ముందర
ఆ దేవుడు నిలువలేడు
యువలోకపు నిర్మాతా!
నవజీవన నిర్ణేతా!
ఓ విశ్వపు టంతరాత్మ!
ఓ భావి కిరీటధారి!
నీ పవిత్ర రుధిరంతో
దీపావళి వెలుగుతుంది
నీ సురభిళ నిశ్వాసల
జీవితవని చిగురించును
ఉరుములు నీ రణగరలు
పిడుగులు నీ భృత్యకోటి
భూకంపాల్ నీ దూతలు
కొండలు పిండిగజేసే
దండిబలం కలదు నీకు
నీ దృక్కులు సవ్యసాచి
నిశిత మహాస్త్రముల మించు
రా యీ శిథిలాలపైన
స్వాతంత్ర్య పతాక మెత్తు!
రా! యీ శిథిలాలమీద
రక్త పతాకమ్ము ఎత్తు!

మూలం: హవేలీ

Source: Press Academy Website, Pragathi Patrika, December 1969

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/